టీడీపీలో టికెట్ ట్రిక్‌లు

- కావలిని రాజకీయ భవిష్యత్ అడ్డాగా మార్చుకున్న బీద
- మాలెపాటికి టికెట్ ఎరవేసి వాడేసుకుంటున్న వైనం
- మొన్నటి వరకు తనకే టికెట్ అనుకున్న మాలెపాటి
- మరో ధనవంతుడికే టికెట్ ఖరారనే ప్రచారం
- ప్రభుత్వ కార్యాలయాల్లో మాలెపాటి రభస



కావలి: సార్వత్రిక ఎన్నికలు సమీపించే సరికి టీడీపీ కొత్త డ్రామాలకు తెరతీస్తోంది. కావలి టికెట్ ఆశవహుడు మాలెపాటి సుబ్బానాయుడు ఏకంగా జనంతో పాటు లోకేశ్ దృష్టిలో పడేందుకు ఛీప్ ట్రిక్స్ ప్రయోగిస్తున్నాడు. ప్రభుత్వ కార్యాలయాల్లో మాలెపాటి తన అనుచరగణంతో రభస సృష్టిస్తున్నాడు. టీడీపీ అధినేత కొడుకు లోకేశ్ యువగళం యాత్ర జిల్లాలోకి ప్రవేశించిన నేపథ్యంలో కావలిలో తన ఉనికిని చాటుకునేందుకు మాలెపాటి వ్యవహార తీరు హద్దులు దాతుతోంది. ఏకంగా ప్రభుత్వ కార్యాలయాల్లోకి చొరబడి అధికారులను నిర్బంధించి ఉక్కిరిబిక్కిరి చేయడం ద్వారా ప్రచారంలో రావాలనే ప్రయత్నం చేస్తున్నట్లు రాజకీయ అభిజ్ఞ వర్గాల బోగట్టా.

కావలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ రాజకీయంగా క్షేత్రస్థాయిలో నామ మాత్రపు ఉనికికే పరిమితమైంది. టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిత్వం కోసం ఆ పార్టీ నేతలు ఎవరికి వారు తమదైన శైలిలో పైరవీలు చేసుకుంటూ పోతున్నట్లు కనిపిస్తోంది. దశాబ్దన్నర కాలంగా బీద రవిచంద్ర టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జిల్లా అధ్యక్షుడిగా, ఆ పార్టీ నామినేటెడ్ ఎమ్మెల్సీగా కావలి నియోజకవర్గంలో పెత్తనం చేస్తూ తన గుపెట్లో పెట్టుకున్నాడు. పార్టీ అధికారంలో ఉండగా గ్రావెల్, మట్టి పేరుతో వందల రూ.కోట్లు దోచేసిన బీద ఇప్పటికీ తన పెత్తనంలో ఉంచుకున్నాడు. టీడీపీ అధికారం కోల్పోవడంతో పార్టీని నడిపించేందుకు ఆర్థికంగా బలవంతుడైన పంచాయతీ స్థాయి లీడర్‌ను తీసుకువచ్చి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించి నడిపించారు.

ఎన్నికలు సమీపించే సరికి..

సార్వత్రిక ఎన్నికలు సమీపించే సరికి కొత్త ముఖాలు తెరపైకి వస్తున్నాయి. ఇటీవల కావలికి చెందిన ఓ బడాబాబుకే టికెట్ ఖరారు అయినట్లు ప్రచారం సాగింది. చివరికి ఎవరికి టికెట్ దక్కుతుందో తెలియదు కానీ.. అటు బీద, ఇటు ఆ బడాబాబు మౌనంగా ఉంటే ఈ నాలుగేళ్లు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టుకున్న మాలెపాటి మాత్రం టికెట్ రేసులో ముందుండాలని అడ్డదారుల్లో పరుగులు పెడుతున్నారు. ఏకంగా టీడీపీ అధినేత కొడుకు లోకేశ్ దృష్టిలో పడాలనే తాపత్రయంతో చిల్లర రాజకీయాలు చేస్తున్నాడు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే సదరు మాలెపాటి అండ్ కో, బీద కావలి నియోజకవర్గంలో గ్రావెల్, మట్టిని ఊడ్చిపారేశారు. ఇప్పుడొచ్చి అధికార పార్టీ ఎమ్మెల్యే గ్రావెల్ దోపిడీ చేస్తున్నాడంటూ మొసలి కన్నీరు కారుస్తున్నాడు. సాదాసీదా ఆందోళన అయితే ప్రచారం రాదని, ఏకంగా ప్రభుత్వ కార్యాలయాల్లోకి చొరబడి ప్రజాస్వామ్యబద్ధానికి వ్యతిరేకంగా నిరంకుశ పోకడలతో ఆందోళనకు తెర తీశాడు. ప్రభుత్వ కార్యాలయంలో వంటావార్పు అంటూ చేసిన నిరసన ప్రజల్లోనూ అసహ్యం అనిపించింది.

పోలీస్ కేసులు ఉన్న వారికే ప్రాధాన్యత

పోలీసు కేసులు ఎక్కువ ఉన్న వారికి పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని ఇటీవల తరచూ లోకేశ్ చేస్తున్న ప్రచారాన్ని అందిపుచ్చుకున్న మాలెపాటి సుబ్బానాయుడు ప్రభుత్వ కార్యాలయాల్లో అలజడులు సృష్టిస్తున్నాడు. ఆ విధంగా తనపై పోలీసు కేసులు నమోదయ్యేలా ఛీప్ ట్రిక్స్ అనుసరిస్తున్నాడు. మాలేపాటి తనకే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కావలి టికెట్ అని బాహాటంగా ప్రకటించుకుంటున్నారు.

తెరపైకి కావ్య, పసుపులేటి

బీద రవిచంద్రతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా అసలు ఏ పార్టీలో ఉన్నడో కూడా తెలియని దగుమాటి వెంకట కృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి) తనకే కావలి టీడీపీ టికెట్ అని చాపకింద నీరులా ప్రచారం సాగిస్తున్నాడు. ఏరోజు ఏ పార్టీలో ఉంటాడో కూడా తెలియని పసుపులేటి సుధాకర్ కూడా కావలి టీడీపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు స్థానిక టీడీపీ శ్రేణులు చెబుతున్నారు. ఏనాడు కావలి టీడీపీ బాగోగులు పట్టించుకోని బీద కనుసన్నల్లోనే స్థానిక టీడీపీ నాయకులు ఉండాలని సాక్షాత్తూ పార్టీ అగ్రజుడు చంద్రబాబు, లోకేశ్ స్పష్టత ఇవ్వడంతో స్థానిక పార్టీ క్యాడర్ రుసరుసలాడుతోంది. అయితే ఎన్నికల నాటికి బీద రవిచంద్ర ఈ టికెట్ తన్నుకుపోతాడనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. బీద మాత్రం సైలెంట్‌గా తనకు లైన్ క్లియర్ చేసుకుంటుంటే.. మధ్యలో మాలెపాటి, కావ్య, పసుపులేటి టికెట్ కోసం కుయుక్తులు పన్నుతున్నారు.

క్లుప్తంగా

ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఫీజుల దోపిడీ

- ఏబీవీపీ కావలి బాగ్ కన్వీనర్ త్రినాథ్

కావలి: కావలిలోని ప్రైవేట్ కళాశాలల్లో ఫీజుల దోపిడీ విచ్చలవిడిగా జరుగుతుందని, సంబంధిత విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఏబీవీపీ కావలి బాగ్ కన్వీనర్ త్రినాథ్ ప్రకటనలో ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి సరైనటువంటి సదుపాయాలు లేకుండా విచ్చలవిడిగా విద్యను వ్యాపారం చేస్తున్నాయని పేర్కొన్నారు. కళాశాలలోనే యూనిఫామ్‌లు నోట్ పుస్తకాల అమ్ముతూ షాపింగ్ మాల్స్ తలపించేలా వ్యాపారం చేస్తుంటే కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని నిలదీశారు.

నూతన వధూవరులకు ఆశీర్వచనం



వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీధర్‌గార్డెన్స్‌లో మైనార్టీ నాయకుడు వాశిలికి చెందిన మహబూబ్‌బాషా కుమారుడు, మున్సిపల్ శానిటేషన్ ఉద్యోగి మునీర్ బాషా కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం ఆశీర్వదించారు. వధూవరులను ఆయన దీవించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, రహీం, కౌన్సిలర్లు మహబూబ్‌బాషా, పెంచలయ్య, జమీర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

జలదంకి: రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు రైతుభరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని ఏఓ బి. శైలజ ఆదివారం తెలిపారు. జిలుగలు, జనుములు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జెరాక్స్ కాపీలతో ఆర్‌బీకేల్లో సంప్రదించాలన్నారు. మండలంలో బ్రాహ్మణక్రాక-1, 2, సోమవరప్పాడు, గట్టుపల్లి, కేశవరం, చోడవరం, చినక్రాక ఆర్‌బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగం ప్రాణాంతకం

కావలి: సమాజంలో మాదకద్రవ్యాలు వినియోగించడం ద్వారా యువత నిర్వీర్యం అవుతుందని, మాదకద్రవ్యాల వినియోగం నిషేధ చట్టం సలహా సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి తెలిపారు. ఈ నెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నేపథ్యంలో మాలకొండారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. నల్లమందు, గంజాయి, బ్రౌన్ షుగర్ వంటి మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల యువత నిర్వీర్యమవుతుందని, ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలను యువతను అప్రమత్తం చేసి, అవగాహన కల్పించాలని కోరారు.

భూవివాదంపై కేసు నమోదు

ఆత్మకూరు: మండలంలోని బండారుపల్లిలో భూవివాదం ఏర్పడడంతో కేసు నమోదు చేసినట్లు ఆత్మకూరు ఎస్సై ఎం.శివశంకరరావు తెలిపారు. గ్రామంలోని ఇరువర్గాల మధ్య కొన్నేళ్లుగా ఈ వివాదం నెలకొంది. ఈ క్రమంలో వివాదాస్పద భూమిలో వరినాట్లు వేయడంతో మరో వర్గం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వీఆర్వో, సర్వేయర్లు శనివారం భూమి కొలతలు వేసి కొంత ప్రభుత్వం భూమి ఉందని ఇరువర్గాలు ఆ భూమిలో దిగరాదని ఆదేశించారు. అయితే వ్యవహారంపై సర్వేయర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మలుపు బోర్డు ఢీకొని ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులను పరిశీలిస్తున్న ఎస్సై

కొండాపురం: బైక్‌పై వెళ్తున్న ఇద్దరు మలుపు వద్ద అదుపు తప్పి సూచిక బోర్డు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం సాయంత్రం భీమవరప్పాడు-సాయిపేట రోడ్డు మధ్యలో నల్లవాగు వద్ద జరిగింది. కొండాపురం ఎస్సై షేక్ ఖాజావలి సమాచారం మేరకు.. రేణమాలకు చెందిన అల్లాభక్షు, ఖాజా భీమవరప్పాడు నుంచి రేణమాల వెళ్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీలు

కొడవలూరు: కౌలు రైతులకు పంటసాగు హక్కు ధ్రువీకరణ పత్రాలు(సీసీఆర్‌సీ)లు మంజూరు చేస్తున్నామని ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు మాత్రమే సీసీఆర్‌సీలకు అర్హులలని చెప్పారు. ప్రభుత్వం అందజేసే రైతు భరోసా పెట్టుబడి సాయం పొందేందుకు అర్హులవుతారని చెప్పారు.

హాస్టల్ విద్యార్థులకు అండగా ఉంటా



మర్రిపాడులో హాస్టల్ విద్యార్థులకు ఆట వస్తువులు బహుకరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడులోని ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు అండగా ఉండి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని మర్రిపాడు వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి హాస్టల్‌లో విద్యార్థులకు ఆట వస్తువులను బహుకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ అంకయ్య, ఏపిలగుంట ఎంపీటీసీ సభ్యుడు నాయుడు హజరత్‌రెడ్డి, అల్లంపాడు సచివాలయ కో-ఆర్డినేటర్ మౌలాలి, స్థానిక నాయకులు గువ్వల వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు పొదుపు రుణాలు



వాశిలిలో జగనన్న గృహ నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): జగనన్న లేఅవుట్‌లో నిర్మిస్తున్న గృహ నిర్మాణాలకు పొదుపు సంఘాల ద్వారా ఒక్కో ఇంటికి రూ.35 వేల రుణాలు మంజూరు చేయిస్తామని ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. మండలంలోని వాశిలిలో జగనన్న అవుట్‌ను ఆదివారం హౌసింగ్ ఏఈ శరత్ చంద్రతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ గృహ నిర్మాణానికి అవసరమైన సిమెంట్, స్టీలు, ప్రభుత్వం సరఫరా చేస్తున్నదని పొదుపు సంఘాల ద్వారా మంజూరు చేసే రుణాలు లబ్ధిదారులకు మరింత ప్రోత్సాహకంగా ఉంటాయన్నారు. లబ్ధిదారులు త్వరితగిన ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు.

భక్తియోగంపై ప్రతి ఒక్కరికి అవగాహన



మంచి మాట కార్యక్రమం నిర్వహిస్తున్న నిర్వాహకులు

ఆత్మకూరు: భగవద్గీతలోని భక్తియోగంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉన్నప్పుడే సాటి మనిషి కష్టసుఖాలు తెలుసుకోవచ్చునని తెలుగు భారతి సేవా సంస్థ నిర్వాహకులు రామయ్యస్వామి అన్నారు. ఆదివారం సాయంత్రం మేధా పాఠశాల ఆవరణలో మంచి మాట కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెల 4వ ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. చిన్నపిల్లలకు తప్పనిసరిగా భగవద్గీతలోని అధ్యాయాలను వివరించాలని ఆయన అన్నారు. భగవద్గీత సకల మానవాలి అభ్యున్నతికి మార్గనిర్దేశనం చేస్తుందన్నారు. కురుక్షేత్ర సంగ్రామ సమయంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపదేశించిన భగవద్గీతను పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కార్యవర్గ సభ్యులు సోమవరపు సుబ్బరాయుడు, అన్నపురెడ్డి వెంకటరెడ్డి, గోవిందరెడ్డి, ఎస్‌వీ చలమయ్య, రవీంద్రకుమార్, ఎస్‌వీ రమణయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణరావు పాల్గొన్నారు.

చెరువు తూము పనులు వేగం



ముమ్మరంగా సాగుతున్న చెరువు తూము పనులు

కొండాపురం: మండలంలోని కొమ్మి ప్రధాన చెరువు తూము కొద్ది రోజుల క్రితం పడిపోయింది. గ్రామానికి చెందిన కొంత మంది రైతులు మరమ్మతులు చేయాలని అధికారుల చుట్టూ తిరిగారు. అయితే ప్రయోజనం లేకపోవడంతో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వీపీఆర్ ట్రస్ట్ ద్వారా తక్షణంగా రూ.5 లక్షల చెక్కును స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ఎడ్లపల్లి వెంకటరమణయ్య, మన్నం వెంకటసుబ్బయ్యలకు అందజేశారు. ఆ నిధులతో నాయకులు ముమ్మరంగా తూము పనులను చేయిస్తున్నారు. ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ దగ్గరుండి పనులను చేయిస్తున్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ వరి నాట్లు



చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలంలోని పలు గ్రామాల్లో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నారు. ఇప్పటి వరకు సుమారు 1000 ఎకరాల్లో వరి నాటారు. సుమారు 2,000 ఎకరాల్లో నాటే అవకాశముంది. కొత్తపల్లి ఆర్‌బీకే పరిధిలో డ్రమ్ సీడర్ ద్వారా 300 ఎకరాల్లో వరి విత్తనాలు వేశారు. ఈ విధానంతో ఎకరాకు రూ.3 వేల నుంచి రూ.3,500 ఖర్చు తగ్గుతోంది. మండలంలో 200 టన్నుల యూరియా, 15 టన్నుల డీఏపీ అందుబాటులో ఉందని ఏఓ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సోమశిల, బొమ్మవరం గ్రామాల్లో లేపాక్షి మినీ కిట్స్ రకం వేరుశనగ విత్తనాలు 165 సంచులు ఇచ్చామన్నారు. మండలంలో 610 మంది రైతులు పీఎం కిసాన్ ఈకేవైసీ ఈ నెలాఖరులోగా చేయించుకోవాలన్నారు.

వరి పైరులో పొటాష్ తప్పనిసరి

వరి నాటే పొలంలో ఎకరాకు 150 కిలోల సూపర్ ఫాస్పేట్, 45 కిలోల యూరియా, 17 కిలోల పొటాష్ ఆఖరి దుక్కిలోనే వేసి నాట్లు వేయాలని ఏఓ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పై పాటుగా కాంప్లెక్స్ ఎరువులు వాడకం వల్ల నేలలో అధిక మొత్తంలో భాస్వరం నిల్వలు పెరిగి పోయి సూక్ష్మ పోషకాలను మొక్క తీసుకోనివ్వకుండా మొక్క పెరుగుదలకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. పొటాష్ వాడకం వల్ల మొక్క తెగుళ్లను, పురుగులను తట్టుకోవడమే కాకుండా వాతావరణ మార్పులను తట్టుకొని ఆరోగ్యవంతంగా పెరుగుదల కనిపిస్తుందన్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్



పోలీసుల అదుపులో కోడిపందేలా రాయుళ్లు

జలదంకి: మండలంలోని వేములపాడు పరిసర ప్రాంతంలో ఆదివారం కోడి పందేలు కోడిపందెం నిర్వహిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు. వీరి వద్ద నుంచి మూడు మోటార్ సైకిళ్లు, రూ. 2,600 నగదుతో పాటు కోళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని సోమవారం కోర్టులో హాజరు పరుచనున్నట్లు చెప్పారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం



సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని 9వ వార్డులో కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి ఆధ్వర్యంలో అంతర్గత సిమెంట్ రోడ్డు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వార్డుకి చెందిన పలువురు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మించాలని తెలిపారు. దీంతో సచివాలయానికి మంజూరైన నిధులతో 9వ వార్డులో సిమెంటు రోడ్ల నిర్మాణం ప్రారంభించినట్లు కౌన్సిలర్ రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ జే ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కె చిన్నపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఫౌండేషన్ సాయం



చేజర్ల (సోమశిల): నిరుపేద కుటుంబానికి మన మైత్రి ఫౌండేషన్ సహాయ పడింది. అనంతసాగరం మండలం చిలకలమర్రికి చెందిన ముద్దిగాళ్ల వెంకటయ్య కుమారుడు తేజ కొద్ది కాలంగా కటిక పేదరిక జీవనం గడుపుతున్నాడు. ఇటీవల తేజ తల్లి అనారోగ్యంతో మరణించింది. ఆ కుటుంబం నివాసముండేందుకు ఇళ్లు కూడా లేదు. ఎండకు, వానకు తడుస్తూ ఇబ్బంది పడుతుండేవారు. ఈ విషయాన్ని గమనించిన మైత్రి ఫౌండేషన్ సభ్యులు ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందించారు. ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో ఆదివారం ఆ కుటుంబ సభ్యులు గృహ ప్రవేశం చేశారు. మన మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు మాట్లాడుతూ నాలుగేళ్లుగా తమ ఫౌండేషన్ తరఫున అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. సభ్యులు పచ్చరాము, బోదేపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

సీతారామపురం: మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీరు, విద్యాశాఖ, వ్యవసాయం, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, గృహనిర్మాణ శాఖలపై సమీక్షిస్తారన్నారు. ఆయా శాఖల అధికారులు సమావేశానికి తప్పక హాజరుకావాలన్నారు.

అర్హులకు లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష



జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: అర్హులకు లబ్ధి చేకూర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. అల్లూరు నగర పంచాయతీలోని ఆర్‌డీఆర్ కాలనీలో ఆదివారం జగనన్న సురక్ష కార్యక్రమ సర్వేను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా ఇంటి వద్దకే అధికారులు వస్తారని, సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవాలని తెలిపారు. అర్హులై ఉండి పథకాలు అందకుండా ఉంటే తగిన ధ్రువపత్రాలు అందిస్తే తిరిగి పొందవచ్చన్నారు.

డస్ట్‌బిన్ల పంపిణీ

నగర పంచాయతీని పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కోరారు. స్థానిక ఆర్‌డీఆర్ కాలనీలో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇంటింటికి 3 డస్ట్‌బిన్‌లను కాలనీ వాసులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీఓ శీనానాయక్, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జమీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు నీలం సాయికుమార్, మేడా కృష్ణారెడ్డి, బీద రమేష్, దైవాదీనం, ఉస్మాన్ షరీఫ్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, మేడా శ్రీనివాసులరెడ్డి, బత్తల సుధ, కరుణాకర్, పోలయ్య, రాజేష్, రంగనాయకులు, మునిరాజ్ పాల్గొన్నారు.

అచ్చమాంబ బ్రహ్మోత్సవాల ముగింపు



ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న ఆలయ పురోహితులు



ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభించిన ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని పొంగూరు మాలిచేలో కొలువైన అచ్చమాంబ పేరంటాలు వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో అంగరంగ వైభవంగా ముగిశాయి. అశేష భక్తజనం తరలిరాగా దేవాలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం అమ్మ వారికి మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పలువురు నాయకులతో కలిసి అమ్మవారి మూలమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు పాశర్లపూడి వెంకటేశ్వర్లుశర్మ, చింతలపల్లి మధుసూదనశర్మ భక్తులకు విశేష పూజలు, అర్చనలు నిర్వహించి ఆశీర్వదించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అచ్చయ్యనాయుడు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

కోలాహలంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

ఈ సందర్భంగా ఎండ్ల బండలాగు పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలను తిలకించడానికి బద్వేల్, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలకు చెందిన వేలాది మంది పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ పోటీల్లో వైఎస్సార్ జిల్లా పోతిరెడ్డిపల్లికి చెందిన ప్రసాద్‌రెడ్డి ఎడ్లు మొదటి బహుమతి గెలుచుకోగా, కేతిగుంట మాజీ సర్పంచ్ మందాడి శ్రీనివాసులు నాయుడు రూ.25,016 ప్రోత్సాహ బహుమతిని మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. రెండో బహుమతిని వైఎస్సార్ జిల్లా గుంతపల్లికి చెందిన మోదేపల్లి వెంకట సుబ్బయ్య ఎడ్లు గెలుచుకోగా పొంగూరు సర్పంచ్ అన్నపురెడ్డి రమణమ్మ, రామిరెడ్డి దంపతులు రూ.20 వేలు నగదు ప్రోత్సాహకాన్ని విజేతలకు అందజేశారు. మూడో బహుమతిని వైఎస్సార్ జిల్లా గోపవరానికి చెందిన విమలయ్య ఎడ్లు గెలుచుకోగా గంగపాళెంకు చెందిన తంగేడుపల్లి శ్రీనివాసులు రూ.15 వేల నగదు ప్రోత్సాహకాన్ని విజేతలకు అందించారు. మర్రిపాడు అనంతసాగరం, అనుమసముద్రంపేట ఎస్సైలు విశ్వనాథరెడ్డి, సంతోష్‌రెడ్డి, నరేష్ తమ సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

- జేసీ కూర్మనాథ్



జగనన్న సురక్ష కార్డులను అందిస్తున్న ఆర్డీఓ

అనుమసముద్రంపేట: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జేసీ రోణంకి కూర్మనాథ్ అన్నారు. ఆదివారం ఏఎస్‌పేటలో జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన దర్గా ప్రాంతంలో స్వయంగా ఇంటింటికి వెళ్లి వివరాలు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే వలంటీర్ల ద్వారా జగనన్న సురక్ష కార్యక్రమంలో తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. కొంత మంది స్థానికులు గతేడాది జగనన్న ఇళ్లుగా తెల్లపాడు వద్ద ఇచ్చినప్పటికీ సౌకర్యవంతంగా లేదని, ఏఎస్‌పేటలోనే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించారు. ఇలాంటి సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టారని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట తహసీల్దారు అన్నదాత వెంకట రమణరావు, ఈఓపీఆర్‌డీ యస్దాని, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు ఉన్నారు.

బాధతగా జగనన్న సురక్ష పథకాన్ని నిర్వహించాలి

చేజర్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని ప్రతి సచివాలయ పరిధిలో పారదర్శకంగా నిర్వహించాలని ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి అన్నారు. ఆదివారం మండలంలోని ఆదూరుపల్లి సచివాలయ పరిధిలో ఎస్టీ కాలనీలో ఆర్డీఓ పర్యటించారు. ఎస్టీ కాలనీ వాసులకు జగనన్న సురక్ష విధి విధానాలు వివరిస్తూ కుల, ఆదాయ ధ్రువీకణ మంజూరు చేస్తూ వారికి గుర్తింపు కార్డులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేజర్ల తహసీల్దార్ శివకృష్ణయ్య, ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, ఆర్‌ఐ సునీత, పంచాయతీ కార్యదర్శి ఏ ఆంజనేయులు, సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో నూరు శాతం లబ్ధి

ఆత్మకూరురూరల్: జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రతి కుటుంబానికి నూరు శాతం లబ్ధి చేకూరుతుందని ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. మండలంలోని రావులకొల్లులో జరుగుతున్న సర్వేను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో పరిష్కారం కాని సమస్యలతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాల వివరాలను సర్వే బృందానికి తెలియజేయాలని కోరారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి కుటుంబానికి టోకెన్ జారీ చేసి నిర్దేశిత కాలపరిమితిలోగా వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉచితంగా అందజేసే ఈ ప్రభుత్వ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామిరెడ్డి మోహన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

బాధ్యతగా జగనన్న సురక్ష సర్వే

కలిగిరి: గ్రామసచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు బాధ్యతగా ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని చేపట్టాలని ఎంపీడీఓ ఆర్‌వీ కళాధర్‌రావు తెలిపారు. చిన్నఅన్నలూరు పంచాయతీలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలను, ఇతర ప్రభుత్వ సేవలను గుర్తించి ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజు, కుడుములదిన్నెపాడు పీఏసీఎస్ చైర్మన్ ములకా శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌రావు, వీఆర్వో శేషయ్య, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



రావులకొల్లులో జగనన్న సురక్ష సర్వే క్షేత్రపరిశీలిస్తున్న ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్



చిన్నఅన్నలూరు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ కళాధర్‌రావు

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు



గాయపడిన శ్రీనివాసులు రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని పొంగూరుకండ్రిక సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో కదిరినేనిపల్లికి చెందిన ఒంగోలు శ్రీనివాసులురెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గుర్తించి 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి వైద్య చికిత్స నిమిత్తం తరలించారు. మర్రిపాడు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.